నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 29-5-2025

## పున్నా శతకం

కూటికి కరువైయున్నను
ఓటుకు నిలువుంది చూడు ఒకసారైనన్
నోటుకు ఓటును అమ్మట
నేటి ప్రజాస్వామ్య రీతి నెరుగర పున్నా.

లంచములిచ్చుట పెరిగెను
లంచము పుచ్చుకొనుటెంతొ అధికములాయెన్
లంచము లేకుండ ఫైలు
కొంచమునైనను కదలదు కొలువుల పున్నా.



- పున్నమి
సెల్:92464 10639

## ఘంటారావం

ఉదయిస్తే
ఉదయం
ద్రవిస్తే
హృదయం.

మనసుకు
ముసుగు
మనిషికి
విసుగు.

ఏమి వాసనే
మూసీ
ఎలా చూసేది
ముక్కు మూసి

ప్రారంభించడం
సునాయాసం
పూర్తి చేయడమే
ఆయాసం.

ఉసిగొల్పితే
ఏమొస్తుంది
అసలుకే
ఎసరొస్తుంది.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## దశ మారిన బంధాలు

రాక రాక వచ్చిన
దగ్గరి బంధువైనా సరే...
ఎదురులేని ప్రేమలతో ఎదురేగిన
సందర్భాలు దొరకవు గాక దొరకవు -
బాధల కుంపటి మోసిన
కన్నీటి చెమ్మను హత్తుకుని, దిటవు
పర్చే
ఓదార్పు వెన్నెల ఆనవాళ్లు
అంటుకోవు..!.
అమ్మో.. నాన్నో... అమ్మమ్మో....
తాతలో..
వృద్ధాప్యంలోకి జారిన ఏ బంధమైన
కావొచ్చు..
తలరాత మారిన ఇంకే చుట్టమో
కావొచ్చు...
పరుగులు పెట్టిన బంధాల ఆరాటంలో
తడారి మెలికలు తిరిగిన ఆపేగు
కొట్టుకులాట ఇక్కడ ఎవరికి
వినిపిస్తుంది..?
సిద్ధం చేసిన సింహాసనమెక్కిన వాళ్ళు
కదా...!.
పొడిపొడిగా రాల్చుకుంటున్న
అంటీముట్టని మాటల అల్లికతో
అంతా ఓ గారడీకోసం కుస్తీ
పడుతున్నట్టు..
అలవాటైన నాలుగు మెరుపు మాటల
వడ్డింపులతో
కొని తెచ్చుకున్న హోదాల చాటింపు-,
మిగిలిన మర్యాదల తేనీరు వేడి
విరామాల ఆరామాన్ని ప్రకటిస్తుంది -!
ఆకలి.. ఆహారం..పట్టింపుల
పరామర్శలుండవు;
ముడేసిన ముఖాలతో
గదులకే పరిమితమైన కొన్ని దేహాల
నిండా
నిశ్శబ్దం గూడు కట్టుకుంటుంది -?!
చదువుల అంగడిలో
సంపదల గొంగడి కొని
తెచ్చుకున్నవాళ్ళు కదా!
ఎవరికి ఎవరు.? ఎందుకు.?ఎలా..?
కాలం కొలమానంలో దాటాల్సిన
నదులెన్నో..!
దశ మారిన గొంగళి పురుగు లెప్పుడో
రంగుల సీతాకొక చిలుకలై ఎగిరెగిరి
పోతున్నాయి
కొత్తకొత్త..పచ్చపచ్చ..లోకాలవైపు
-!
ఇన్నాళ్లు పాకులాడిన వెనకటి తరం ఒకటి
ఇంకా ఆత్మీయతల్ని వండి
వార్చాలనే.....
ఎంతటి ఆరాటం ఉన్నా
ఒంటి చేతికి చప్పట్ల సవ్వడి
ఎక్కడిది?
సంపాదనల సెగలో ప్రేమల తడి
ఎక్కడో ఆవిరవుతోంది..!?
పెంచుకున్న ఆశలపై నీళ్లు జల్లిన
దృశ్యాలు-
ముఖం మడతల్లోంచి జారిన
కన్నీటిబొట్టు
ఏదో అందుకోవాలని
ఆశిస్తున్న అమ్మ అరచేయిలా....
తిరుగు ప్రయాణం కోసం
ఎదిరిచూస్తున్న చెయి సంచిలా......
రెండు తోటల నడుమ
ఓ దారికోసం వెతుకుతున్నట్టు..
పొడిబారుతున్న శివారులో సాగుతున్న
నడక..!!



-మోతుకూరి అశోక్ కుమార్
9247380976

## బంగారు కవిత

నశ్వర దేహం
ఐశ్వర్య లోహం
ఇవాళ తులం బంగారం ధర లక్ష
సామాన్యులకు అందని ద్రాక్ష
ఆశావహులకు శిక్ష.

ఎందుకురా
ఒక లోహానికి ఇంత విలువ!
తుప్పుపట్టదు
వన్నెచెడదు

సన్ననితీగలుగా లాగొచ్చు
రెకులుగా సాగదీయొచ్చు.

మేరు పర్వతం
బంగారంతో ఏర్పడిందంట!
పదండి తవ్వుకొద్దాం,
కనకపు సింహాసనమున
శునకం బలిసిందట
రండి తరిమేద్దాం.

పసిడి పంకా పెట్టుకుంటే
గాలి బంగారుదౌతుందా
ఆ అమ్మాయి
మేలిమిరంగు ముందు
బంగారం వెలవెల బోతుంది.

జనులారా
బంగారాన్ని బహిష్కరించండి!.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

## నాగన్న పదాలు

పైకి పత్తివిత్తులు
తేనే పూసిన కత్తులు
గోముఖ వ్యాఘ్రాలు
ఓరి నాగన్నా!

నీడనిచ్చును తరువు
పంటనిచ్చును చెరువు
ధరణి! మోయు మేరువు
ఓరి నాగన్నా!

-నమిలికొండ నాగేశ్వరరావు

## సమాజ రుగ్మతలకు పరమౌషధం వేమన పద్యం

వేమన కవిత్వం గాయానికి మందు రాసినట్లు గాక, ఆ గాయం చేసిన కత్తికే ముందు మందు పూసినట్టు ఉంటుంది'.... అన్నారు రాళ్ళపల్లి అనంతక్రిష్ణశర్మ. వేమన తనకు తోచిన తత్వమును నిర్భయంగా ప్రజలందరికీ బోధించుటకు ఆంధ్రప్రదేశము నంతటినీ పర్యటించి, అక్కడక్కడ మఠములు స్థాపించి, తన తరువాత తన ఉద్దేశాలపై నమ్మకం గలవారు కొందరున్నట్లు చేయగలిగిన తెలుగువారిలో వేమన ముఖ్యుడు, బహుశా మొదటివాడేమోనని చాలామంది నమ్మకం. ఇతడు బోధించిన అద్వైతం వేరేవారివలే పుస్తకాలను బట్టీపెట్టి చెప్పక, యోగసాధన చేసి అందులోని తత్వం గ్రహించి, తానుభవించి, తనవారిని కూడా అట్లు తరింపజేయవల యునని ప్రయత్నించి ముందకు సాగినవాడు వేమన. మహానుభావులైన రామదాసు, త్యాగరాజు, తాళ్ళపాక అన్నమయ్య మొదలైన వాగ్గేయకారులు, శృంగారముతో విష్ణుభక్తిని వ్యాప్తి చేసిన క్షేత్రయ్య లాంటి పదకర్తలు గొప్పవారే. కాని వీరిలో ఎవ్వరికీ వేమనకువచ్చినంత వ్యాప్తి రాలేదు. దీనికి కారణం వేమన పద్యంలోని పద సరళత, శబ్ద నిడారంబరత, నిరక్షరాస్యులు కూడా ఒక్కసారి వింటే మననం చేసుకోగలిగినంత భావ పఠిమ ముప్పేట కలవోత. వేమన తన పద్యాలను ఎక్కడా లిఖించలేదు. ప్రజల నోళ్ళద్వారానే విస్తృత ప్రచారం పొంది, అనేక స్వదేశీ, విదేశ భాషలోకి సైతం అనువాద ప్రాప్తికి నోచుకొన్నవి. ఇక వేమన స్థల, కాలాదులను పరిశీలించవలసి వస్తే, అనేకమంది పరిశోధకుల ప్రకారం అనేక విధములుగా పేర్కొనుట వలన ఏవీ నిర్ధారణ కు రాలేదు. వేమన కాలం (1367-1478), (1352-1430), (1652-1730 ంఆ) అస్తవ్యస్తంగా ప్రకటించబడినందున, ఎవరెన్ని చెప్పినా నేటికీ ఇది ప్రశ్నార్థకమే. త్రిపురనేని వెంకటేశ్వరరావు తన **'వేమన-పదహారేళ్ళ పరిశోధన'** లో వేమన కాల గణన గురించి ఏకాభిప్రాయం ఇప్పటివరకు లభించలేదు' అని అన్నారు. అలాగే వేమన జన్మ స్థలం గురించి కూడా అంతే! కొందరేమో రెడ్డి రాజులవంశమని, ఊరు కొండవీడు అని, వేరొకరు కడపకు సమీపంలోని చిన్నపల్లెలో వ్యవసాయ మధ్యతరగతి కుటుంబీకుడని వివిధ ప్రకటనలు చేసినారు. వేమన కులం విషయంలో కూడా అదే వివాదం. కొన్ని పద్యాలను బట్టే వేమన స్థలమూ, కులమూ నిర్ణయించడం జరిగింది ఇలా....

**ఊరు కొండవీడు, /ఉనికి పశ్చిమ వీధి, / మూగచింతపల్లి మొదటి ఇల్లు, /ఎడ్డి రెడ్డెకులమదేమని చెప్పుదు../. విశ్వదాభిరామ వినుర వేమ!**

**ఇంకొక పద్యం..... నందన సంవత్సరమున/పొఁదుగ కార్తీకమందు, /బున్నమినాడీ వింధ్యాద్రి సేతువులకును, / నందున నొక వీరు దేరుపడెగా / విశ్వ!!**

ఈ పద్యముల బట్టి జన్మ స్థలం, కులం ఎలా నిర్ణయించారో అనేకమంది కి నేటికీ అర్థంకాని విషయం. ఉదాహరణ కు వేమన సమాధి గురించి, వేమన కడప దగ్గర పామూరు కొండ గుహలో శార్వరి నామ సంవత్సరం శ్రీరామ నవమి నాడు సమాధి చెందాఢని ఒక చోట రాసారు. ఇంకో చోట అనంతపురం జిల్లా కదిరి సమీపంలోని కటారుపల్లె లో సమాధి పొందాడని అంటారు. ఇవన్నీ కాకుండా వేమన చిరునామా వారి పద్యములేననడం నిర్వివాదాంశం. తెలుగు పద్యానికి ప్రపంచఖ్యాతిని సంపాదించి పెట్టినది వేమన పద్యమే. ఫ్రాన్స్ దేశానికి చెందిన ' లీ-గాక్ ' అనే క్రిస్టియన్ మత ప్రచారకుడు సంజీవనాథ స్వామి పేరుతో 1730 లో వేమన పద్యాలను తొలిసారి సేకరించారు. అదే దేశానికి చెందిన **'అబేదుబారు'** ఆనే కాథలిక్ బోధకుడు 1806 లో **'హిందువుల ఆచారాలు'** అనే పుస్తకాన్ని ఫ్రెంచి భాషలోకి అనువదించాడు. దాన్ని ఈస్టిండియా కంపెనీ వారు ఆంగ్లం లోకి అనువదించి ప్రచురించారు. అందులో అబేదుబారు వేమనను గురించి ప్రస్తావించాడు. ఈ విధంగా వేమన గురించి ఇంగ్లిష్ వారికి తొలిసారిగా తెలిసినది. ఆ తరువాత 1829 లో సి. పి. బ్రౌన్ "వేమన నీతి పద్యములు' పేరుతో పుస్తకం ప్రచురించారు. ఆ తరువాత 1839 లో బ్రౌన్ రెండోసారి దాదాపు 18 సంవత్సరాలు వేమన సాహిత్యం పై ధ్యాస వుంచి మరికొన్ని సేకరించి అచ్చువేయించాడు. ఇంకొక విశేషమేమిటంటే ఎంతోమంది పరిశోధకులకు వీలుకాని, అలివి గాని బ్రౌన్ కాలంనాటి 1839 లోని 1164 పద్యాలను తెలుగు ప్రజలకు అందించిన ఘనత పరిశోధనా శ్రామికుడు బంగోరె (బండి గోపాల రెడ్డి) కే దక్కుతుంది. నార్ల వెంకటేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా వేమన చరిత్రను 14 భాషల్లోకి అనువదించడానికి కారకులయ్యారు.

వేమన పరిశోధకులలో హెన్రీ బ్యూచాంప్(1897), విలియమ్ హోవర్ట్ కాంబెల్ (1910), జి. ఎస్. రావ్, ఫాదర్ లీ గాక్ తదితరులు ప్రముఖులు. తెలుగులో



వేమన జీవితం గురించి పరిశోధన చేసినవారిలో ప్రముఖులు వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వేఃకటేశ్వర శాస్త్రి, కొమర్రాజు వేంకట లక్ష్మరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్ళపల్లి, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఆచార్య ఎన్. గోపి తదితరులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి లోతుగా శ్రమించి నూతన కోణములనావిష్కరించారు. కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ అంటారు శ్రీ శ్రీ. **"కవిత్వతత్వ విచారం' లో కట్టమంచి రామలింగారెడ్డి వేమన గూర్చి 24 పంక్తులే రాసినా ఆ గొంతు ఇప్పుడు 24 వేల పంక్తులుగా పురి విప్పింది"** అన్నారు ప్రముఖ కవి, పరిశోధకులు, విమర్శకులు ఆచార్య ఎన్. గోపి. వేమన సాహిత్యానికి అమితాకర్షితుడైన సి. ఇ. గోవర్ అనే గొప్ప సాహితీ విమర్శకుడు వేమనను ' లోక కవి ' గా పేర్కొన్నాడు. వేమన పద్య మకుటానికి నానార్థాలు ప్రచారంలోకి వచ్చినా కొంతమంది పండితుల అభిప్రాయం 'సృష్టికర్త కు ప్రియమగు వేమా వినుము' అనే అర్థాన్ని సి. పి. బ్రౌన్ స్వీకరించి పద్యాలను ఆంగ్లములోకి అనువదించాడు. ఇవి బ్రౌన్ ' లవతీబవబ నీట లవఎజీనిజీ' లోనివి. మచ్చుకు కొన్ని పద్యాల ఆంగ్లానువాదాలను చూద్దాం.... . . As you sing again and again / the melody of raga excels. / as you eat neem again and again/ it becames sweeter/ with practice, things become perfect/ Beloved of the bounteous vema... Listen!..( **అనగ అనగ రాగమతిశయిల్లు చుండు/ తినగ తినగ వేము తియ్యనుండు/ సాధనమున పనులు, సమకూరు ధరలోన/ విశ్వదాభిరామ వినుర వేమ/.** ) ఈ అనువాదం ఎంత సులభతరమైనదో, అందరికీ అర్థమౌతుంది. ఇంకొక అద్భుతమైన పద్య అనువాదం... 'He that relying on the prince, ruins the land,/ the sorrow of the people shall reach him/ and at last he shall fall/ How long shall the bounding ball retain its elevation.. ( **భూపతి దయనమ్మి భూమి చెరచు వాడు, / ప్రజల వుసురు తాకి పడును పిదప/ ఎగురవేయు బంతి ఎందాక నిలుచురా/...విశ్వ!!.** ). ఇది ఎంత గొప్ప పద్యమో విన్నంతనే అర్థమౌతుంది. భూకబ్జాదారులకు ఇది గొడ్డలి పెట్టు. పైకెగరిన బంతి కిందపడక తప్పదని ఆ నాడే భూమ్యాకర్షణ ను కూడా వివరించాడు వేమన. తన పద్య సాహిత్యంలో, ఇలాంటి పద్యాలు వేలకు వేలు వున్నవి. వేమన ఆవిష్కరించని కోణం మనకు సమాజంలో కనబడదు. ... **'తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు/ బుట్టనేమి వాడు గిట్టనేమి/ పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా..!! విశ్వ!!.** ఈ పద్యం తెలియని తెలుగువాడుండడు. ఏ నాడో రాసిన ఈ పద్యం ప్రసిద్ధమైనదే కాని, ఇది నేటికీ ఈ సమాజాన్ని పీడిస్తున్న సమస్య. లాలించి, పాలిచ్చి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యదశ లో వీధిపాలు చేస్తున్న యువకులు బతికున్నా, చచ్చినట్టే అని వాపోయిన దార్శనికుడు మన వేమన. ఇలాంటి పద్యాలు కోకొల్లలు. ....' **గంగ పారుచుండు కదలని గతితోడ/ మురికి బారుచుండు మోత తోడ/ దాత యోర్చినట్లు అధముడోర్వగ లేడు/ ! విశ్వ!... దీనికి విశ్లేషణ అవసరమా!. ....:." పాము కన్న లేదు పాపిష్టమగు జీవి/ యట్టి పాము జెప్పినట్లు వినును/ యిలను మోహిదెల్ప నెవరి తరము/....** అంటాడు వేమన. ఇలా ఎన్నని చేప్పుకోగలం. స్థలాబావం వలన చెప్పుకోలేం. చివరిగా ఒక్క పద్యం....' **కామి గాని వాడు కవి కాడు, రవి కాడు/ కామిగాని మోక్ష గామి కాడు/ కామియైన వాడు కవియగు రవియగు/..!విశ్వ!!..** ఇక్కడ కామి అంటే వేరు అర్థం కాదు. తపన, పట్టుదల, సాధించాలనే కోరిక గొప్పకవినే కాదు, రవిగాకూడా మార్చగలదని కవి అభిప్రాయం. ఇలా

పద్యం లోని మొదటి, రెండవ పాదాలలో చెప్తదలచు కున్నది చెప్పి మూడో పాదంలో దానికి తగిన **' సామ్యం '** చెబుతాడు వేమన. రాళ్ళపల్లి వారు 1928 లో అనంతపురం కళాశాలలో వరుసగా వారం రోజుల చేసిన ప్రసంగాలే 'వేమన '. ఒక కవి నివసించిన సమాజానికి ఆ కవి సాహిత్యానికీ సమన్వయం చెబుతూ విమర్శ రాసే పద్ధతికి రాళ్ళపల్లి వారు శ్రీ కారం చుట్టారు. వారే తన ఫరిశోధన లో వేమనను ఒక కవిగా మాత్రమే గాక, సంఘ సంస్కర్తగా, ఒక హేతువాది గాను, ఒక యోగిగాను చూసారు. వారి పద్యాలను పద్యాలుగా కాక వాటి వెనుక నున్న భావం, వాటి నేపథ్యం వివరించడానికి ప్రయత్నించారు రాళ్ళపల్లి అనంతక్రిష్ణశర్మ. వేమన పద్యాలు ఈ తరం వారికి పరిచయం చేయవలసిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా వుంది. యువతకు అవి జ్ఞాన సంపదలు. నేడు వేమన పద్యాలు ప్రభుత్వ పాఠశాలలలోనే కాకుండా కార్పొరేట్ పాఠశాలలలో కూడా పాఠ్యాంశాలుగా పెట్టడానికి ప్రభుత్వం చర్య చేపట్టాలి. వ్యక్తిత్వ వికాసము, విజయానికి పది మెట్లు, గమ్యం నీ అరచేతిలోనే వుంది లాంటి మోసపు కబుర్లుచెప్పి పిల్లల తల్లిదండ్రుల నుండి లక్షలు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా వ్యవస్థలకు 'చేక్' పెట్టడానికి ప్రత్యామ్నాయ విధానం ఒక్కటే,. చిన్న వయసు నుండి విజ్ఞానానికి ఉగ్గుపాలలాంటి వేమన పద్యాలను నేర్పాలి. ఇది తక్షణ కర్తవ్యం.

యువతలో అంతరించి పోతున్న, పోయిన నైతిక విలువలను తిరిగి రాబట్టుకోవాలంటే వేమన పద్యాల్లాంటివి అందుబాటులోకి తీసుకురావడమే ఏకైక మార్గము. వేమన ప్రతి పద్యం ఒక ఉద్యమం అన్నది అక్షరాలా నిజం. చివరిగా నాకిష్టమైన వేమన పద్యం తో ముగింపు...

**స్వానుభూతి లేక శాస్త్ర వాసనలతో**
**సంశయంబు వీడదు సాధకునకు.**
**చిత్ర దీపమునకు చీకటి బోవునా!**
**విశ్వదాభిరామ వినుర వేమ.**



-మాయకుంట్ల నారాయణరెడ్డి
99896 86603.

## బౌద్ధ భారతాన్ని నిర్మిద్దాం

తెల్లని పావురాలు
ఖండాంతరాలకు ఎల్లలు లేని ప్రయాణం
నదులు, కొండలు, సంద్రాలు
స్వాగతం పలుకుతున్నాయి
కడలిలో ఏదో సందడి
చేపలు గుంపులు గుంపులుగా ప్రయాణం
చీకటి పొరలు చీల్చబడుతున్న చప్పుడు
సూర్య కిరణాలు అంతరంగాల
దివ్వెలను వెలిగిస్తున్నాయి
తథాగతం... తథాగతం.. బుద్ధ గమనం
జీవన మాధుర్య తరంగం
ప్రపంచానికి శాంతి పంచిన విహంగం
రాజ్యాన్ని తృణప్రాయంగా వదిలిన త్యాగ నిరతి

జ్ఞానం కోసం నిరంతర అన్వేషణలో తపస్సు
దుఃఖ నివారణే జ్ఞాన మార్గం
విశ్వ శాంతి దూతగా ఆవిర్భావం
మేధోమథనంలో ప్రశ్నోపనిషత్తు
దుఃఖం కలిగిస్తుందెవరు?
రాజ్యమా? వర్ణాధిపత్యమా?
కులాధిపత్యమా? పితృస్వామ్యమా?
ఆర్థిక దోపిడీయా?
ఏదీ అనే తర్కం?
అన్వేషణలో అంతరంగ వీక్షణ
కామం మూలమేది?
కోరికలకు పుట్టుక ఎక్కడ?
పంచేంద్రియాలకు ప్రేరణలేవి?
జ్ఞానేంద్రియాల విజయ స్రవంతి చోటెక్కడ?
మంచి మాట సుగంధ పరిమళం
మంచి చూపే అంతరంగ వీక్షణం
మంచి జ్ఞానం ఇతరులకు మేలు
ద్వేషం లేని, మాత్సర్యంలేని,
క్రోధములేని అనుకంప
ప్రభుత కూడా తల్లి ఒడిలో సేదదీరాల్సిందే
ఇవ్వు.... పెరుగుతావు
ఇచ్చుటే.. సంపద
ఇవ్వడంలో విస్తృతి... ఇవ్వడంలో త్యాగం
ఇవ్వడంలో ఎదుగుదల... ఇవ్వడమే మాతృత్వం
ఇవ్వడంలోనే ప్రేమ రాజ్యావిర్భావం
ప్రేమలో తత్వం ఉంది
ప్రేమలో జీవితం ఉంది
ప్రేమలో జీవనం ఉంది
ప్రేమ ఓ శాంతి! ఓ కాంతి! క్రాంతి... విక్రాంతి!
ప్రేమ మనుష్యుల అంతరాలు తొలగిస్తుంది
బౌద్ధం అంటే ప్రేమను పంచడమే
బౌద్ధంలో యుద్ధం ఉంది
సమరం అంతరంగంలోనే
అంతరంగ చలనమే కదలిక
చలనాచలన వివేచనలో సత్యనిర్ధారణ
అంతరంగం ఓ విశ్వం...
పాలపుంతల్లోని నియమం
అంతరంగానికి ఇరుసు
నియమబద్ధమైన జీవితమే బౌద్ధమార్గం
ఆ కర్తవ్య దీక్షే సోపానం
ఆ నియమం అకృత్యం..
బౌద్ధం మతం కాదు
బౌద్ధం ధర్మం... మానవధర్మం... ప్రపంచ ధర్మం
దానికి ఎల్లలు లేవు అదర్తలు లేవు
కోట బురుజులు లేవు
బౌద్ధ తత్వంలో అహం లేదు
అదొక ఆత్మీయ జీవనం
ఒక గాథా సప్తతి
అది ప్రపంచ భాష... మానవ భాష
గుండె రుస....
తల్లి వేదన నుండి పుట్టిన
దుఃఖ నివారణా గానం
బౌద్ధం ఒక సజీవ గానం
అది సూక్తుల పల్లకి... కావ్య గానవల్లరి
మంగలి, చాకలి, పంచముడు
ఎందరికో ముక్తినిచ్చిన బోధన
ఎందరో ప్రవక్తలను, బోధకులను, వైద్యులను,
తథాగతం సృష్టించింది
అంతఃపురాల ద్వారాలు తెరిచి
నందుని భార్య సుందరి
ఆకాశ అరణ్యాలు దాటి
ఆయనను అనుసరించలేదా!
క్రౌర్యాశోకుడు అతని
జ్ఞాన భిక్షతో కరుణార్ద్రుడు కాలేదా?
అతడు కత్తి దించాక
నెత్తుటేరులకు అడ్డుకట్ట పడలేదా?
స్థూపములు, చైత్యములు,
ఆరామములు ఆవిర్భవించలేదా?
కరుణ సంద్రాలు పొంగలేదా?



-డా॥ కత్తి పద్మారావు
9849741695

నదీ నదాల నుండి దయార్ద్రమైన పాటల వెల్లువ
గానదుందుభులు మోగించలేదా?
నిజమే! ఆనాడు మాతృత్వం విస్తరించింది.
సంపద వర్ధిల్లింది... సంపద పంచబడింది
ఎందరో చక్రవర్తులు తమ కరవాలాలు దించారు
శ్వేత వస్త్రాలు ధరించి భిక్షా పాత్రలు చేతబూని
గడప గడపకు అడుగులేసి తలుపు తట్టి
కామ వ్యామోహాలు తరిమి వేసి
హృదయాల్లో జ్ఞాన జ్యోతులు వెలిగించలేదా?
పంచేంద్రియోన్మాదం ఆనాడు జయించబడింది
అడవుల నుండి కూడా
జుంటి తేనియలు ప్రవహించాయి
సానుకూల దృక్పథం
మనుషుల్లో మానవత్వాన్ని రగిలించింది
ఆ చండాల మహార్వాడల్లో నుండి
ఒక మహోన్నతుడైన అంబేద్కరుడు జనించాడు
పంచనీతులు, అష్ట ధర్మాలు
అతని కిరీటమయ్యాయి
ప్రేమ సామ్రాజ్యానికి
అతడు చక్రవర్తి అయ్యాడు
భారతదేశ పునర్నిర్మాణానికి
రాజ్యాంగాన్ని అందించాడు
అస్పృశ్యతా గాయానికి ఔషధాన్ని అందించారు
మనిషిని మనిషి ప్రేమించే
జీవన తత్వాన్ని ప్రబోధించాడు
సమత్వాన్ని అందించే
మహాదాతగా ఆవిర్భవించాడు
స్త్రీల సంకెళ్ళను తెంచి విముక్తి ప్రధాత అయ్యాడు
మరో బుద్ధుడు అయ్యాడు
తథాగతం ఒకనాడు
అశోకుని వెలిగించింది,
ఈనాడు అంబేద్కరిజం
అది నిత్య భారత జీవనగానం
శతాబ్దాలకు ప్రవహించే పునరుజ్జీవనం
బౌద్ధం అంతం లేని శాంతి సందేశం
ఆ మార్గంలో నడుద్దాం
బౌద్ధ భారతాన్ని నిర్మిద్దాం......
(బుద్ధ పౌర్ణమి సందర్భంగా)

## శాంతికి జై కొడదాం!

వాడు నీచాతి నీచంగా
ఉన్మాదించి తెగించాడు
వాడెప్పుడు బరితెగిస్తాడా అని
వీడు ఎదురు చూస్తున్నట్టయ్యింది
వాడు పర్యాటకులకు యముడయ్యాడు
మనోడు పాపం అక్కడి పౌరుల
ఇళ్లను మాత్రమే కూల్చేసాడు
తప్పని ప్రతీకారానికి
మనందరి కళ్ళనుండీ రక్తమే
ఛిద్రమై బూడిదయినదంతా
చావు దుఃఖపు మానవత్వమే..
××
మనం ముందంజలో ఉంటే
వాడు వెనుకంజ వేస్తే
కోడి పందాల ఆటలు
రసవత్తరం! రక్తసిక్తం!
కోట్లాది జనం జ్వరపడిపోతున్నారు
కొత్త కోరల కరోనా దాడులకు
కుదేలయి చచ్చిపోతున్నారు
కంటికి కళ్ళూ పీకేస్తే
అంధత్వం! అంధకారం!
భయంలో పడి బతుకువేట
యుద్ధమంటే పెనుగులాటా?
××
ముష్కరులూ ఉగ్రవాదులూ
మానవాళికి పగోళ్ళు
ఈ యుగపు మృగాతిమృగాళ్ళు
ఆ విషపు వృక్షాలను కొట్టేస్తూ
దుంపనాశనం చేయాల్సిందే!
మానవ సమూహాల నుదిటిపై
సలపరింతలతో నెత్తురోడుతున్న
పచ్చి గాయాల్ని మాన్పాల్సిందే
శాంతివనాలను పెంచాల్సిందే
నవ్య రాగాలు కట్టి పాడాల్సిందే
జై శాంతీ! జై జై మనిషీ!



-అనిశెట్టి రజిత
9849482462

## హక్కులు-బాధ్యతలు

హక్కుల సాధన కోసం..
దిక్కుదిక్కునా తిరిగి పోరాటం చేస్తారు!
బరువు బాధ్యతల్ని వదిలించుకోవడానికి
పరువు ప్రతిష్టల్ని సైతం పణంగా పెడతారు!.

హక్కులంటే అందరిలో
చిక్కని వెన్నెల్లో విహరిస్తున్నంత పరవశం!
బాధ్యతలంటే అందరికీ
ఆద్యంతం జడివానలో తడుస్తున్నంత కలవరం!

హక్కులు..ఎవరికైనా
ఉత్సాహ పరిచే అయాచిత చెక్కులు!
బాధ్యతలు..ఎవరికైనా
కాళ్ళకి కట్టిన వీడని బంధనాలు!

హక్కులెన్నైనా.. ఎన్నెన్నైనా
హాయి గొలిపే వసంత ఋతువులనిపిస్తాయి!

బాధ్యతలు కొన్నైనా.. పరిమితమే అయినా..
తీర్చక తప్పని మొక్కులుగా తోస్తాయి!

బాధ్యతల్లేని హక్కులు..
అలరిస్తాయి.. శ్రావ్యమైన ఋక్కుల్లా!
హక్కుల్లేని బాధ్యతలు..
అనిపిస్తాయి.. గొంతుకు బిగిసిన పాశాల్లా!

నిర్మోహంగా అనుభవిస్తే
హక్కుల పొరల్లో దాగిన బాధ్యతలు కనిపిస్తాయి!
మనసు పెట్టి నిర్వర్తిస్తే..
బాధ్యతలతో బాటు..
కొన్ని ఊహకందని హక్కులూ
సంక్రమిస్తాయి!



-షేక్. కాశింబి
సెల్: 90522 16044

## ఆకాశమంత ప్రేమ

శిలను చెక్కే మహా శిల్పి
ఆప్యాయతను వర్షించే మేఘం
తొలి అడుగులు వేయించిన మార్గదర్శి
తొలి పలుకులు నేర్పిన ఆది గురువు
అనంత అనురాగాల మూట
కొండంత త్యాగమయి
ఆకాశమంత ప్రేమ అమ్మ !
అమ్మ లేనిదే జన్మ లేదు
అమ్మ పదానికి శత్రువు లేదు
ఆమె ప్రేమకు ప్రత్యామ్నాయం లేదు
అమ్మ పాల కన్న అమృతాహారం లేదు
తల్లికి తత్సమానమైన పాత్ర లేదు
అమ్మ దీవెన కన్న శక్తి మరొటి లేదు
ఆమె త్యాగానికి మూల్యం లేదు !
ఆమె చల్లని ఒడి..
ప్రశాంతత వడ్డించే గుడి
కుటుంబాన్ని ఏకం చేసే మహాశక్తి
ఇంటి గడపకు పసుపు పారాణి తోరణం
ఆమె హృదయం హిమంత చల్లదనం
ఆవేశమెరుగని అనురాగ దేవత అమ్మ
బిడ్డ ఆకలి తెలిసిన లోక జ్ఞాని
చిన్నారి చిరునవ్వుల పువ్వులతో..
తన కడుపు నింపుకునే దయామయి
అన్నామృత వర్షిణి అమ్మ !
బిడ్డ గుండెల్లో కొలువైన దేవత
పిల్లల ఉనికి, ఊపిరి కూడా అమ్మే
అంతరిక్షమంత సహనం ఆమె సొంతం
ఎవరెట్టంత మహోన్నత వ్యక్తిత్వం
పదవి విరమణ లేని అమాయక జీవి
బిడ్డల సురక్ష కవచం అమ్మ
ఆమె చేతి ముద్ద అత్యంత రుచికరం
అమ్మ కొంగు బిడ్డకు రక్షణ గొడుగు !
కాలం మారుతోంది
తరాలు మారుతున్నాయి
విలువలు వాణిజ్య వస్తువులైనాయి
బంధాలకు షరతులు మొలుస్తున్నాయి
బంధుత్వాలు బలహీన పడుతున్నాయి
అన్నీ కాలంతో పాటు మారుతున్నా..
అమ్మ స్థానం మాత్రం సుస్థిరం
అమ్మ పదం పరమ పవిత్రం
అమ్మతనం
ఆమె అపూర్వ వరం !
అమ్మను చిన్నబుచ్చ వద్దు
అమ్మ కన్నీటికి కారణం కావద్దు
అమ్మను ఆక్షేపించ వద్దు
అమ్మ మనసును గాయపర్చవద్దు
అమ్మ వంటకు వంక పెట్టవద్దు
తిన్నింటి వాసాలు లెక్కించవద్దు
అమ్మ త్యాగాన్ని మర్చిపోవద్దు
కూర్చున్న కొమ్మను
నరుక్కోవద్దు !



-మధుపాళీ
994970003



# మహాకవి శేషేంద్ర ఆధునిక ఇతిహాసం : నా దేశం నా ప్రజలు

**(శేషేంద్ర ఆధునిక ఇతిహాసం : నా దేశం నా ప్రజలు ( 1975 - 2025) సందర్భంగా మే 30న శేషేంద్ర వర్ధంతి సందర్భంగా )**

ఈ ఆధునిక ఇతిహాసం 'నాదేశం నా ప్రజలు' ను శేషేంద్ర తన "ఆధునిక మహా భారతం" లో ప్రజా పర్వం శీర్షికతో మొదటి పర్వంగా చేర్చారు. ఈ ప్రజాపర్వమే శేషేంద్ర "ఆధునిక మహాభారతం" నకు గుండెకాయ వంటిది. ఈ సంపూర్ణ మహాకావ్యం శీర్షిక లోనే 'నాదేశం నా ప్రజలు' అనే "ఆధునిక మహాభారతం" అని నామకరణం చేశారు శేషేంద్ర .

"నేనెప్పుడు గొంతెత్తినా నాకోసం కాదు, ఐదుకోట్ల మంది కోసం కాదు, యాభై కోట్ల మంది కోసం గొంతెత్తుతాను. నేను పడుతున్న బాధలే నా దేశమంతా పడుతోంది, నా మానవజాతి అంతా పడుతోంది – కనుకనే నా జ్వాలిక నా దేశం నాలిక!" అదే – 'నాదేశం నా ప్రజలు అని ప్రకటించారు శేషేంద్ర పుస్తకానికి ముందు మాటలో, ఇంకా' ఇతిహాస నిర్మాణానికి బాధానుభూతి పూర్వక బలి కావాలి. నేనే ఆ బలి ! నా వయస్సు, నా పాండిత్యం, నా ప్రతిభ, నా అనుభవం సర్వం పిండి మాటల గొంతులో పోసిన నా రక్తం ఈ ఇతిహాసం' అన్నారు. 'ఇది ఈ శతాబ్దం ఇచ్చిన పాట' అన్నారు.

ఈ ఇతిహాసంలో నాయకుడు శ్రామికుడు. అతని గాథే ఇది. శ్రామికుని జీవితంలోని శ్రమైక జీవన సౌందర్యమే ఇందులోని ఇతివృత్తం. 'నాదేశం నా ప్రజలు' లో సర్గలు ఎనిమిది. ప్రాచీన అలంకారికుల ప్రమాణాల్ని బట్టి నాదేశం నా ప్రజలు'ను మహాకావ్యమని, ఇతిహాసమని చెప్పారు శేషేంద్ర. 'నాదేశం నా ప్రజలు' ను ఇంగ్లీష్ లోకి 'ఓఎ అనీబీనిబితీఎ ఓఎ ఖవనీజూశ్రీ? పేర శేషేంద్రనే అనువాదం చేశారు. హిందీలోకి ప్రసిద్ధ కవి శ్రీ ఓం ప్రకాశ్ నిర్మల్ అనువాదం చేశారు. అలాగే ఉర్దులోకి ప్రసిద్ధ విమర్శకులు కవి అయిన శ్రీ అక్తర్ హసన్ గారు అనువాదం చేశారు. భారతీయ సాహిత్యంలోనూ, విశ్వ సాహిత్యంలోనూ అభివ్యక్తి రీత్యా, కవిత్వం రీత్యా అద్భుతమైన మహాకావ్యం శేషేంద్ర 'నాదేశం నాప్రజలు'



**కవి ఒంటరి కాదు, కవి అంటే వ్యక్తుల సముదాయం, వ్యవస్థ సముదాయం, కవి అంటే ఒక జాతి, ఒక దేశానికి ప్రతీక, ప్రతినిధి.**

"లేస్తుంది. ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం. ఆ హస్తం కాలమనే నిరంతర శ్రామికుడి సమస్తం; మనిషి పొలాల్లో ప్రవహించే చెమటలో రక్తంలో మునిగి లేస్తుంది. దూర తీరాలకు సింధూర కాంతులు చిందుతూ ఉంది" ఇలా మొదలవుతుంది శ్రామికుడి జీవితపు నేపథ్యంగా మొదటి సర్గలో కావ్యం.

'నేను ధాన్యంలోనించి పుట్టాను, ధాన్యం కోసమే బతుకుతాను, మరణించి ధాన్యంలోకే వెళ్ళిపోతాను.........

"నేను మానవ జీవిత పొలాలన్నీ దున్నుతా' అని అంటాడు కవి.

కర్షకుని లోకి పరకాయ ప్రవేశం చేసి, బ్రతుకులోని శ్రమ సౌందర్యాన్ని గుర్తుకు చేస్తూ, కాని బతుకులోని దైన్యాన్ని గురించి కూడా చెపుతూ,

"నా బతుకొక సున్న, కాని నడుస్తున్నా...."

"వేళ్ళు కాళ్ళయి నడిచే చెట్టు మనిషి చెట్టుగా ఉంటే ఏడాది కొక వసంతమన్నా దక్కేది. మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను!"

పై కవితా వాక్యాల్ని గమనిస్తే తెలుస్తుంది, శేషేంద్ర కవిత్వ అభివ్యక్తి చాలా గొప్పది. విషయమేదయినా, వస్తువును గొప్పగా కవిత్వమయం చెయ్యడం శేషేంద్రలో ఉన్న గొప్పతనం.

కవి ఒంటరి కాదు, కవి అంటే వ్యక్తుల సముదాయం, వ్యవస్థ సముదాయం, కవి అంటే ఒక జాతి, ఒక దేశానికి ప్రతీక, ప్రతినిధి, అలాంటి కవి మనిషి గురించి, మనిషి ఆత్మ విశ్వాసం గురించి, శక్తి గురించి చెపుతూ, "కొండలతో, సముద్రాలతో కలిసి బ్రతికేవాడికి తుఫాను లొక లెఖ్ఖా" అంటాడు. కవే సమాజం, కవే మనిషి, కవే శ్రామికుడై మనిషిలోని సమస్త ఆవేశాలను ఆవేదనలను స్ఫురణకు తెస్తూ,

"నీకెందుకింత అశాంతి, నీ కెందుకింత ఆవేశం అంటే ఏమి చెప్పను? సముద్రాన్ని అడుగు నీకెందుకింత అశాంతి అని, ఝంఝా మారుతాన్ని అడుగు నీ కెందుకింత ఆవేశం అని."

ఇలా బతుకులోని బాధలకు, కష్టాలకు, కన్నీళ్ళకు గొప్ప సమాధానం, ఆలంబన కవి రచన. దేనికి వెరువ వలసిన పని లేదంటూ ఆత్మ విశ్వాసంతో ఇలా చెపుతాడు, "కాలాన్ని నా కాగితం చేసుకొంటా, దాని మీద లోకానికి ఒక స్వప్నం రాసిస్తా, దాని కింద నా ఊపిరితో సంతకం చేస్తా!"

శేషేంద్ర కవిత్వంలోని గొప్పతనం కొత్త అభివ్యక్తి, కొత్త డిక్షన్ శేషేంద్ర మాటల్లోనే చెప్పాలంటే శేషేంద్ర కవిత్వం ఒక విశిష్ట భాష.

శేషేంద్ర 'నాదేశం నాప్రజలు' కథాకావ్యం కాదు. కవి జగత్తు, శ్రామికుడి జగత్తు మిళితమై సాగిపోయిన భావాత్మక కావ్యం. అడుగడుగున ప్రకృతి ఇందులో పులకించి, పరవశించి పోతుంది కవి చేతిలోపడి.

'సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు'

'మొదట నన్ను చూచి కన్నీరు కార్చిన చెట్టు ఇప్పుడు నా కలమీద, పూలవాన
కురిసింది'

'అలసిన నా ప్రయాణంలో ఒక చెట్టు నీడే నా కుటీరం;
రాలిన ఒక పువ్వే నా అతిథి'

'కొమ్మల్లో ఆకులమాటున చూస్తే, అగుపిస్తాయ్ పక్షుల అడుగులు,
నిరుడు ఎగిరిపోయిన నిమిషాల గురుతులు'.

ఇలా అడుగడుగున అద్భుత కవిత్వంతో పాఠకున్ని పరవశింపజేస్తుంది. శేషేంద్ర రచన. శేషేంద్ర 'నాదేశం నా ప్రజలు' లోకథా వస్తువు కోసం కాదు, కవితా వస్తువు కోసం చూడాలి.

"సముద్రాలు, భూమి ప్రేమలేఖలు రాసుకొనే నీలి సిరా గిన్నెలు, ఆ సిరాలోంచి గాలులు మోసుకొచ్చే అ సామ్రాజ్యాలు, నాగరికతలు, విజ్ఞాన పరిమళాలు. ఆ పురాతన గాలులు నా ముందున్న దూరాలు దాటడానికి నాకు కావలసిన బలాన్ని ఇస్తావు నీవు మనిద్దరం కలిసి మన ప్రజల అంతిమ సమరాన్ని గెలుస్తాము."

వ్యక్తి నుండి సమాజానికి, సమస్తానికి ఎదగాలి కవి. అలాంటి జీవితానికి ఉదాహరణలు పై కవితా వాక్యాలు.

కవికి కవితా వస్తువులు దేశంలోని రాళ్ళు, రప్పలు, నదులు, సముద్రాలు, చెట్లు, చేమలు, మనుషులు, సర్వప్రాణులు కూడా

ఇలా అంటాడు. "అవి రాళ్ళని ఎవరన్నారు, నోళ్ళు మూసుకున్న అంతరాత్మలు' "అవి ఎండలని ఎవరన్నారు. రాళ్ళమీద దండయాత్రలు చేస్తున్న మంటల సైన్యాలు" "నాతో పాటు ఈ రాళ్ళు గత చరిత్రకు రక్తమిచ్చాయి'

కవికి సామాజిక అవగాహన ఉండాలి, కవిత్వం గొప్ప సందేశం ఇవ్వాలి. దేశానికి ప్రజలకు దిశా నిర్దేశనం చేయాలి. యాంత్రికతలో కొట్టుకు పోతూ, మౌళిక వనరులు, అవసరాలు, ఉత్పత్తులను మరిచిపోతున్న విద్యార్థుల నుద్దేశించి ఇలా అంటాడు.

''లే బాబూ! లే బాల్యంలోనించి లే! పుస్తకాలవతల పారేయ్ !

నాగలి భుజాన వేసుకో ఈ కలాలు విడిచి పెట్టి ఆ పొలాల్లో కలుప్, గత కాలపు దారులకు కఠినంగా వీడ్కోలు చెప్పు".

"పొలాలు మీ పాఠశాలలు, అడవులు, నదులు ఉదయాస్తమయాలు మీ గురువులు హృదయ పూర్వకంగా వాటి భాషకు లొంగండి, వాటి శిక్షణ పొందండి'

ఇంకా

"ఎందుకు నీకా గుండె నీవు దాన్ని బాధలతో నింపుకో లేకపోతే!"

"ఎందుకు నీకా కళ్ళు నీవు వాటిని కన్నీటితో తడుముకోలేకపోతే "

"రోజు నేను వెయ్యిసార్లు ఏడుస్తాను నీకు తెలుసా ?"

ఇది శేషేంద్ర కరుణా రసమైన కవిత్వజాలం.

శేషేంద్రది వ్యవస్థ పై మార్పుకోసం ధర్మాగ్రహం. వ్యవస్థలో మంచికోసం, మార్పుకోసం తపన పడేవాళ్ళకు ఇలా సందేశం ఇస్తాడు.

"పాము కాటుతో భస్మమవుతున్న ఓ నా ప్రజలారా! రండి మీకో కొత్త పద్యం ఇస్తా, ఈ పద్యం మీకో కొత్త ప్రాణం ఇస్తుంది. ఒక కొత్త ప్రయాణం ఇస్తుంది."

'నాగస్వరం ఊదే క్షుద్ర విద్య నేర్చుకోకండి, పామును చంపే ఉన్నత విద్య నేర్చుకోండి'.

"ఈ దేశంలో, వంగేవాడికి వంగి సలాం చేసేవాడు పుడుతున్నాడు, జాగ్రత్త ! ఈ లక్షణం తలయెత్తిందంటే, ఆకాశంలో తోకచుక్క పుట్టిందన్నమాటే."

"వాడ్ని చంపెయ్యండి, పాములు వాటంతట అవే చస్తాయి."

శేషేంద్రది ఇలా అద్భుత కవిత్వ ప్రవాహం అడుగడుగనా, "నాదేశం నా ప్రజలు" ఏ పేజీ తిప్పి చూసినా.

"నేను పోతేపోతాను, మళ్ళీ రాకపోవచ్చు కానీ నా జ్ఞాపకాల బారి నించి తప్పించుకోలేరు మీరు. అవి ఈ దేశపు గాలుల్లో పక్షులై పాడుతుంటాయ్. కిరణాలై అల్లుకుంటాయ్.'' అక్షరసత్యాలు శేషేంద్రశర్మ మాటలు.

"ఇతిహాసం ఈనాటి మనిషి

**పురుషుడు తనకు కావలసిన రసాత్మక, భౌతిక, మానసిక ఆనందాన్ని స్త్రీ నుండి పొందుతాడు, సంతృప్తిని బతుకులో నింపుకుంటూ పరిపూర్ణ విజయుడై ముందుకు సాగుతాడు విజయపథంలో**

నగరాల్ని వెలిగించాయి, దేశాల్ని పాలించాయి, ఆ సిరాతో లిఖించినవే మానవ ఇతిహాసాలు..."

ఇలా శేషేంద్ర కవిత్వానికి వ్యాఖ్యానాలు అక్కర లేదు. అది ముట్టుకుంటే పచ్చి నెత్తురులా తాకే సహజ సిద్ధమైన కవిత్వం. శేషేంద్ర కవిత్వం గురించి వర్ణించడం అంటే రసాలూరుతున్న పండిన మామిడిపండును గురించి వర్ణిస్తూ ఇది తియ్యగా ఉంటుంది, కమ్మగా ఉంటుంది అని చెప్పే బదులు, ఈ మామిడి పండును మీరే తిని చూడండి తెలుస్తుంది అని చెపితే బాగుంటుంది.

శేషేంద్ర రసైక ప్రేమమూర్తి, పురుషుడు తనకు కావలసిన రసాత్మక, భౌతిక, మానసిక ఆనందాన్ని స్త్రీ నుండి పొందుతాడు, సంతృప్తిని బతుకులో నింపుకుంటూ పరిపూర్ణ విజయుడై ముందుకు సాగుతాడు విజయపథంలో

ఇలా అంటాడు, "చూడు ప్రేమరాశీ!

మన చూపులు కలిశాయి, నా కన్నులు నిదుర విడిచాయి, నా ప్రజల కలల్లో కాంక్షల్లో కలిశాయి.

ఈ భూమండలం మార్గాల్లో ఒంటరిగా నడువలేను.

నా బ్రతుకు వెయ్యి విధాలుగా నీవనే ఒక నాజూకు నూలు పోగుల జాలంతో అల్లిన దుకూలం – భార్యగా, నెచ్చెలిగా, ప్రేయసిగా,
మాతృదేవతగా, చంటి బిడ్డగా,
ఒకటేమిటి నా సర్వస్వంగా....
ఆశల్నీ ఆశయాల్నీ గానం చెయ్యాలి
ఈనాటి తిరుగుబాటుని గురించి
గర్జించాలి.
నాగలి పట్టుకుని నేల దున్నేవాడు
ఆ జాతికంతా చిహ్నం
ఇది ఈ శతాబ్దం ఇచ్చిన పాట
నా దేశం – నా ప్రజలు (ఆధునిక ఇతిహాసం )" అన్నారు శేషేంద్ర

1975 తొలి ముద్రణకు శేషేంద్ర ఉపోద్ఘాతంలో.

"ఇది విశంతి తమ శతాబ్ద పంచసప్తతి తమ సంవత్సరాన (1975) విప్లవభాషావిధాత కవిసేనమేనిఫెస్టో ప్రణేత బుధజనవిధేయ శేషేంద్రనామధేయ కవివర్యప్రణీత నాదేశం నా ప్రజలు నామాంతర సమేత ప్రజాపర్వము సర్వము సమాప్తము" అంటూ ఈ ఆధునిక ఇతిహాసం 'నాదేశం నా ప్రజలు' ను శేషేంద్ర తన "ఆధునిక మహాభారతం'' లో ప్రజా పర్వం పేరుతో మొదటిపర్వంగా ముగించారు గొప్ప ఆత్మ విశ్వాసంతో. శేషేంద్ర కవిత్వం అజరామరం.



**– సబ్బని లక్ష్మీనారాయణ,**
8985251271

## మహాకుంభమేళ

మహాకుంభ మేళ
గంగ యమున సరస్వతి
నదులు కలిసిన త్రివేణి సంగమంలో!
పుణ్య స్నానాలు, గంగా హారతితో ప్రత్యేక పూజలు,
పవిత్ర స్నానాల కోసం కోట్ల జనం యాత్రలు.
రుద్రాక్ష మాల ధరించిన ఋషులు మునులు తపస్సు
చేసి లోక క్షేమంకోసం
పూజలు పాప పుణ్యాల నడుమ, కోరిన కోర్కెలు
తీర్చమని! వేడుకొనే
భక్త జన సందోహం....!!.
బ్రహ్మాది దేవతలు దిగి మోక్షం ఇచ్చినట్లు
ఉన్నదని అనిపిస్తుంది....!!.
కులాలకు అతీతంగా
మన కుంభ మేళా పవిత్ర
నదీ జలానికి, లేదు మతం...!!.
గంగా యమునా సరస్వతి పులకించినట్లు,
భూమాత నేల తల్లి పరవశించినట్లు కుంభమేళ
భక్తుల మోక్ష మార్గం అదృష్టం.....!!

**-పరుచూరి నాగేంద్రమ్మ.**
9160443381

## కవితార్చన



అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..
-సంపాదకులు

## ప్రాగ్దిశ వీణ

నిశి రాతిరికి వీడ్కోలు చెప్పి
ప్రాగ్దిశ వీణపై వేకువ రాగాలు పాడుతూ
మిల మిలలాడే వెలుగులు పంచుతూ
సప్తాశ్వ రథా రూఢుడై
పక్షుల కిలకిల రావాల నడుమ
మహారాజులా ఏతెంచె
తూరుపున ఉదయ వాకిళ్లు తెరుచుకొని
అరుణారుణ వర్ణాలు వెదజల్లుతూ....
సుప్రభాత గానాలు
సురుచిర సుందర దృశ్యాలు
ఊగే తరువుల కొమ్మలు
ప్రియమారగ తలలూపుతూ...
లోకాలన్నీ మేలుకొని
భక్తితో భాస్కరునికి అర్ఘ్యమిస్తూ
స్వాగతం పలికిన వేళ
మనసానందంతో సంతసించిన వేళ
హృదయాహ్లాదం పొందుతూ......
చిరునవ్వులతో అందించింది
మరొక ఉషస్సు బహుమానంగా
పెంచింది కర్తవ్య నిర్వహణకై నీ ఆయుష్షు
కలల తీరం చేరి పెంచుకుంటావని నీ యశస్సు
నిర్లక్ష్యాన్ని ఆవలకు తోసేసి
గెలుస్తావని......

**-రమాదేవి బుక్కపట్నం**
9849596053

## భరోసానిచ్చే బంధాలు

ఒకేగూటి లోని గువ్వలమై
కష్టసుఖాలు పంచుకున్న సోదరులుమై
రక్తసంబంధ అనుబంధమై
మేనులు దూరంగా ఉన్నా
మనసులు దగ్గరగా ఉండే అన్నదమ్ములం
అమ్మా,నాన్నల ప్రేమకు ప్రతిరూపాలం
ఒకే కడుపున పుట్టిన
రెండు ప్రేమతత్వపు హృదయాలం
కన్నవారి ఆశయాలను
సుసంపన్నం చేసే భవితవ్యాలం
వంశాన్ని వృద్ధి చేయుటలో
ప్రముఖ పాత్రధారులం
కుటుంబానికి పేరు ప్రతిష్టలు పెంచే
మూల స్తంభాలం
తోడబుట్టిన చెల్లెలికి పంచే ప్రేమానురాగాలం
సోదర భావంతో నేనున్నానని ఇచ్చే భరోసాలం
నాన్న తర్వాత కుటుంబ సంక్షేమాన్ని
భుజాన వేసుకునే బాధ్యతలం
అన్న అనే మాటలో దాగి ఉన్న
అమ్మా,నాన్న అనే అంతరార్థాలం

**-స్వాతి కరుణాకర్**
+91 89854 16321

## ప్రేమ ప్రవాహం...

గగన సిగలో దూరిన శశి
గళమెత్తి పాడుతున్న వెన్నెల పాటకు..
పరవశిస్తున్నాయి పడుచు హృదయాలు..
మైమరచి పోతున్నాయి ప్రేమ పక్షులు..
ఆశలు రేపే కురులు..
అల్లరి చేసే కళ్ళు..
ఎరుపెక్కిన బుగ్గలు..
ఆకర్షించే ఎదలు..
వంపులు తిరిగిన నడుము
వయ్యారి నీ నడక ..
నీ అపురూప లావణ్యం..
నీ తనువే అమృత రూపం..
చిరునవ్వును ఎరగా చేసి..
చూపులను గాలంగా వేసి..
లాగావు నా హృదయాన్ని..
నీ గాలానికి చిక్కి అయ్యాను
నీ అందానికి దాసోహం..
ఇక తీరాలి నాలో మరుల దాహం..
మల్లెల పరిమళం గుభాలిస్తుంటే..
వెన్నెల కాంతి వేడెక్కుతుంటే..
పరిచిన మంచం ఆహ్వానిస్తుంటే..
అడ్డు అదుపు లేని వయసు..
అరమరికలన్ని మరచి
చుంబనాల ఒడిలో తడుస్తూ..
గాఢ పరిష్వంగణలో పరవశిస్తూ..
ముందెన్నడు పొందని అనుభవం..
మురిపెం తీరగ ఆస్వాదిస్తూ...
నేను నీలో కలిసి
నీవు నాలో నిలిచి..
సురలోక భోగాల శిఖరం చేరి..
ప్రేమ ప్రవాహం చెలియలి కట్ట దాటగ..
ఇహలోక వైభోగాన విహరించనా..
.ఆనంద లోకంలో విశ్రమించనా...

-లగిశెట్టి ప్రభాకర్ జనగాం
9441700316

## వీణాపాణి

వీణాపాణి కి కవితార్చన చేయుట నా పూర్వజన్మ సుకృతం " .
నా మనసులోని భావాలను అక్షరీకరణ చేయుట ఆనందం.... సంతోషం.
కమ్మనైన గుమ్మ పాల తెలుగు ఆస్వాదించిన నేను హంస వాహినిని కవితార్చన చేస్తే సంతృప్తి .
అరువది నాలుగు కళలకు కాణాచి... భారతదేశం లో జన్మించుట వలన కవితా వాసనలు వీడుటలే.
నా కవిత్వంలో బమ్మెర పోతనామాత్యుని మాధుర్యము లేకపోవచ్చు?
నా కవిత్వం శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యదకు సరితూగకపోవచ్చు....
నా కవిత్వంలో అల్లసాని వారి అల్లిక జిగి బిగి
మచ్చుకైనా కానరాక పోవచ్చు....
అయినప్పటికీ....
నా కవిత్వంలో ఆర్తి యున్నది .
సమాజానికి ఏదో చెప్పాలనే తపన యున్నది .
మానవత్వాన్ని మేలుకొలిపే శక్తి యున్నదని తృప్తిపడే !
మంచిని పెంచే రచనలు చేసే యుక్తి తో....
నా కవితలు కొందరినైనా ఆలోచింపచేస్తే...
నా జన్మ ధన్యం మయ్యే 'భావావేశాల- ఆనందాను భూతులతో పాటు....
సమాజంలోని అణగారిన వర్గాల వ్యధాపూరిత అంశాలను స్పృశించగలిగితే' "వీణాధారి " సంతృప్తి చెందినట్లే !!!

**-కాదంబరి కృష్ణ ప్రసాద్**
9494925565

పుస్తక సమీక్ష

# తిరుమల వేంకటస్వామి-రచనా కదంబం-పూదోట

**"ఈ రాముని దయ చేతను నే రాసిన ప్రవాతలన్నియు అతనంపినవే"** పేరడీ పద్యారంభం తో తిరుమల వేంకట స్వామి వినమ్ర భక్తి తత్పరతతో పూదోటలోకి మనల్ని తీసుకు వెళ్తారు. ఈ సాహితీ వనంలో తోటమాలిగా, వేంకట స్వామి రాసిన కథలు, కవితలు, పాటలు, ఏక పాత్రలు, పద్యాలు, వ్యాసాలు, బుర్రకథ, కొత్తసామెతలు, పరిమళ భరితంగా గుబాళింప చేస్తున్నాయి. వైవిధ్య భరితమైన రచనలతో సాహితీ సరస్వతిని ఆరాధిస్తున్న వేంకటస్వామి, సాహ సంగా తన ఆలోచనలను, భావా లను నిష్కర్షగా వ్యక్తీకరించే రచయి తగా గుర్తింపు సాధించారు. ఈ సంపుటిలో కథ, కవిత, పద్యం, వ్యాసం ఏ ప్రక్రియ అయినా వినూత్న సందేశాన్ని, సమాజ సంక్షేమానికి, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తు న్నాయి. విద్వత్ గద్వాల చెన్నకేశవా! మకుటంతో రాసిన పద్యాలలో సమాజం తీరు తెన్నులపై హెచ్చరి కలు, విమర్శలు సూటిగా సంధిం చారు. సినిమా పాటలకు పేరడిలలో కూడా వెంకట స్వామి కవిగా తన హృదయంలోని తీవ్ర భావావేశాన్ని, ఆవిష్కరించారు. ప్రాస కోసం ఎక్కువగా ప్రాకులాడకుండా, కేవలం భావానికి ప్రాధాన్యత యిచ్చిన పద్యాలు రాయడంలో విశేష ప్రజ్ఞ కనపడుతుంది. గాంధీ, శాస్త్రీజీ, గాడ్గే బాబా వంటి మహనీయుల జీవితా లను సంక్షిప్తంగా వివరిం చారు. తిరుమల వేంకటస్వామి కవిగా, రచ యితగా, బుఱ్ఱకథ, కథ, పాట, ఏక పాత్ర ఏ ప్రక్రియ చేపట్టినా కొత్త చూపుతో, భావావేశంతో మనం ఊహించని రీతిలో రాయగల ప్రజ్ఞ ఈ పూదోటలో స్పష్టమవుతుంది. నూట నలభై తొమ్మిది రోజులు, అమెరికాలో బాలలకు తెలుగు పలకడం, రాయడం నేర్పించడం గురించిన అనుభవాలు స్ఫూర్తిదాయకంగా వున్నాయి. విద్యాసంస్థ ప్రిన్సిపాల్గా విద్యా సేవలందించిన ఉత్తమ అధ్యాపకునిగా రచయిత వేంకట స్వామి మదిలో ఎన్నో ఆలోచనాత్మక అంశాల వైవిధ్యం, ప్రతిభావంతంగా పూదోట దర్శింప చేస్తోంది. ఈ రచనా కదంబంలో రచయిత ఉత్తమ భావాలతో సమాజ శ్రేయస్సు అభిలషిస్తారు. తాను విశ్వసించిన, తనకు సబబు మంచి అనిపించిన, తనకు రచించిన విషయాలను కూడా హాస్య, వ్యంగ్య భరితంగా సూటిగా, స్వేచ్ఛగా రచనలుగా వెలువరించగల ప్రజ్ఞగల వెంకటస్వామి వంటి రచయితలు, అరుదుగా ఉంటారు. వారి భావావేశం, రచనా చమత్కృతి, నిరవధిక రచనాశక్తి అభినందనీయం.




**ప్రతులకు:** రచయిత
ఇ.నెం.602,
పరిమళాసదన్, కమలానగర్
చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్.
సెల్:9391109616



**-జయసూర్య**
సెల్: 9440664610

## ఎండాకాలం తాతీల్

తాతీల్ లలో అమ్మగారింట్లో
గడిపిన బాల్యం మరువలేనిది...మళ్ళీ రానిది
వాళ్లకు తెలిసినన్ని ఇకమతులు ఇప్పటికి మనకు తెల్వాయి
వాళ్లు పలికే శాత్రాలు తర్వాయిబట్టి ఒకటి తర్వాత ఒకటి
ఒడవకుండా శాంతాడు లెక్క వస్తనే ఉంటాయి
అజా కాకముందే ఎగిలి వారంగనే లేవాలె
అని నేర్పిన ఆరోగ్య సూత్రాలు
కష్టం చేసి బతకాలె బిడ్డా
దొడ్డు బట్టదోసెడు అంబలి కోసమే చేసేదంతా
అని చెప్పిన నీతి సూత్రాలు ఎప్పటికి ఆచరణీయాలు
గడ్డికోసి దుద్దేకేసి బర్రెకు కుడితికి పెట్టి
చంటి పిల్లలా చూసుకొని సున్నితత్వాన్ని బోధించి
ప్రేమ నేర్పిన ప్రేమ పంచిన పెద్దమనుషులు
మూడురాళ్ల పొయ్యి మీద వంట మొత్కాకుల ఇస్తార్లు
ఇంక ముత్తేమంత తిను బిడ్డ అన్న ప్రేమ ఏడ దొరికాల్నే అవ్వ
మంచినీళ్ల బాయికాడ మంచినీళ్లు ఎత్తుకొచ్చి
కలుషితం కాని నీళ్లు తాపిన కల్మషం లేని మంచి మనసులు
బుర్రకాయతో ఈతకు దింపి భయం పోగొట్టిన ధైర్యశాలులు
నెత్తిన రుమాలు చుట్టుకొని కిర్రు చెప్పులు వేసుకొని
కాలుకు ముల్లు నాటకుండా భుజాన ఎత్తుకొని
బోడగుట్ట చెరువుకట్ట మీదికెళ్లి సావటి దాకా సవారు చేసినం
ఏడ దొరుకుతది తాత అంతకు మించిన సింహాసనం
ఎంత అలసినా మొగురానికి ఒరిగి పగటి నిదుర పనికి చేటు అని
పిట్ట కునుకు తీసిన నాడు సమయం విలువ తెలిసింది
పొద్దు కూకంగానే బుక్కెడు తిని నులక మంచం వేసుకొని
మొగలు వైపు చూస్తు ఆడుకుంట పాడుకుంట
పొడుపు కథలు విప్పి చెప్పి జీవన నైపుణ్యాలు నార్పెటోళ్ళు
తాటి ముంజలు తెచ్చి పలంచే మీద పెట్టి
ఈత పండ్లుతెచ్చి తనాబిల దాచి
మామిడి పండ్లు తెచ్చి అర్రల మాగేశి
దాచి దాచి ఇచ్చిన ప్రేమ ఇప్పుడు ఏడ దొరుకుతది తాత
గోటీలు గిల్లిదండ అష్టాచెమ్మా పచ్చీసలు
తాటిముంజ కాయల బండ్లు ఇచ్చిన ఆనందం
సొప్పతో ఫంక చేసి ఉరికిన రోజులు
ఇపుడు విమానాలు కూడా ఇయ్యాయి
పాతాళ్ల గరిగెతో దేవినట్టు ప్రతి ఎండాకాలం తాతీల్లల
అమ్మగారిల్లె యాదికస్తది
అమ్మమ్మ తాతనే గుర్తుకస్తరు .
(తాతీల్ అనే ఉర్దూ పదానికి అర్థం సెలవులు)



**-బొల్లం బాలకృష్ణ,**
*9989735216*

## అమ్మ

అ ఆ లతో ఆమె
అమ్మ గా జన్మఇచ్చి
అపురూపమైన జన్మ
అనురాగాలు పంచి
ఆత్మీయతను పెంచే
ఇల్లాలు ఇలవేల్పు
ఈశ్వరుడి త్రినేత్రం
ఊరట నిచ్చి
ఉబ్బితబ్బిబు అయ్యే ప్రేమకు
సాంకేతం
ఋణం తీర్చుకోలేనిధి
నీతో ఎప్పుడు రుణనుబంధం
తిరని ది
ఎన్ని ఆటంకాలు ఎదురు అయిన
అయిన వారికోసం త్యాగం చేసి
ఐన వారి కోసం
ఒంట్లో శక్తి నంత ధారపోస్తూ
ఒరిమి తో,నెరిమితో
ఔ దర్యం చూపించే తరుణి
అందరి అవసరాలు తీర్చే
ఒక ధరణి
అః ఆహా అనిపించే
శక్తి స్వరూపిణి
సృష్టి కారిణీ
అమ్మ నీకు వందనం



**-ఉమాశేషారావు వైద్య**
*9440408080*

## వాళ్ళు మనుషులా?

వాళ్ళు మనుషులా
మనిషి తోలు కప్పుకున్న
నర రూప రాక్షసులు
ఉగ్రవాదమనే నయంకాని వ్యాధిని
ఒంటకి పట్టించుకొని
పిచ్చెక్కిన మృగాలు వలె
దేశ, విదేశాల్లో తిరుగుతున్న ము ష్కర లు
జాలి, కరుణ లేని కసాయివాళ్ళు
మనుషుల్లో రాక్షసులువలె మన మధ్యేఉంటు
ప్రమాదం తెచ్చేవాళ్ళు
వారిని అలాగే వదిలేస్తే ఎలా?
వారి దుశ్చర్యలు వలన
భర్తను పోగొట్టుకున్న భార్య
కొడుకును పోగొట్టుకున్న తల్లి
వారి దారుణ మారణకాండకు
భోరున విలపించిన భారతావని
హృదయ వేదనను ఆపేదెలా
మదమెక్కినవారిని సమాజంలో తిరగనివ్వాలా
ఎందరివో ప్రాణాలను తీసిన ఉగ్రవాదులును
ఏం చేయాలి
దేశ సంపత్తికి బీటలు వేస్తున్నవార్ని
ఎలా తిరగనివ్వాలి
క్షమా గుణం ఉండడం మంచిదే
కరుడు కట్టిన కసాయి వారి పట్ల
క్షమా ఏ మాత్రం నిలుస్తుంది
వ్యాధి ముదిరిన భాగాన్ని తీసేయకపోతే
దేహం మొత్తం వ్యాధిగ్రస్తం
పెట్రేగి పోతున్న ఉగ్రవాదులు ను
ఉగ్రవాదమును సంహారం చేయకాపోతే
యావత్ దేశాన్ని కే నష్టం
వాళ్ళు మనుషులు కానప్పుడు
ఇప్పుడు మనమేమి చేయాలి?
యుద్ధమా, రాయబారమా



**-విశ్వనాథ నరసింహం**
*9490971589*

## సునందామృతం

**దశనామేకాదశ న్యాయము**

దశ అంటే పది.ఏకాదశ అంటే పదకొండు.

దశనామేకాదశ అంటే పదిలో పదకొండు అన్నమాట.

పదిలో పదకొండేమిటీ? వస్తే పది తర్వాత కదా.పదిలో పదకొండు ఎలా వస్తుంది?.ఇది వంద మిలియన్ల ప్రశ్న అయినా మన వాళ్ళు ముఖ్యంగా తెలుగు వాళ్ళు అనుకునే గుంభనమైన మాటిది.

పండుగలకు,పబ్బాలకూ, పెళ్ళిళ్ళు పేరంటాలకు ఆచారం, పద్ధతి, సంప్రదాయం, పరువూ మర్యాద ఇలా అనేక రకాలుగా అనుకుంటూ తనకు ఉన్నా లేకపోయినా "ఏదైనా కొంత డబ్బును (ధనము) ఖర్చు (వ్యయము) చేయవలసి వచ్చినప్పుడు, మరికొంత డబ్బును వెనుకాడకుండా ఖర్చు చేయడం.అలా తప్పని సరై ఖర్చు చేసే వాళ్ళు పైకి గంభీరంగా "అయితే అయింది ఏం చేస్తాం? "పదిట్లో పదకొండు" అనుకోవడమే" "దశానామేకాదశ న్యాయము.ఇలాంటి న్యాయాలను చదువుతున్నప్పుడు, సామ్యంగా ఉన్న సామెతలు,జాతీయాలను చూస్తున్నప్పుడు ఏమనిపిస్తుందంటే... మన వాళ్ళు బాధలను, కష్టాలను సమస్యలను చిరునవ్వుతో స్వీకరించి, ధైర్యంగా అధిగమిస్తారని."ఇంట్లో బియ్యం నిండుకున్నాయి" అంటారు. సామాన్య అర్థంలో చూస్తే ఇంట్లోకి బియ్యం వచ్చి చేరాయని.కానీ అర్థం అది కాదు "అయిపోయాయి అని". ఇలా ఇంట్లో ఏవైనా అయిపోతే వాటిని గురించి 'నిండుకున్నాయి' అని చెప్పడంలో వారి గుంభనతమే కాకుండా ఆర్థిక స్థితి కూడా ఇమిడి ఉంది.ఈ కోవకు చెందినదే "పదిట్లో పదకొండు". ఇల్లు కట్టేటప్పుడు ఇంత బడ్జెట్ లోనే కట్టుకోవాలని అన్ని ప్లాన్లు వేసుకుంటాం. బంధువులో స్నేహితులో వచ్చి "ఇంత ఖర్చు పెట్టి కట్టుకుంటున్నావ్. కట్టబోయి మళ్ళీ కడతావా? ఫలానాది కూడా చేర్చితే బాగుంటుంది, ఇలా చేస్తే బాగుంటుంది". అని సలహాలు సూచనలు ఇస్తుంటారు.ఇంకేముంది... నిజమే కదా !""పదిట్లో పదకొండు' అనుకుంటూ అదనపు ఖర్చుకు సిద్ధపడి పోవడం " చూస్తూ ఉంటాం.అలాగే పెళ్ళిళ్ళ విషయంలో కూడా ఇదే తంతు. మనసును గట్టి పరుచుకుని ' దేనికీ తగ్గేదేలే' అనుకుంటూ ఖర్చు చేయడం చూస్తున్నాం.ఈ మధ్యే వచ్చిన "బలగం" సినిమా దీనికి చక్కని ఉదాహరణ. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా, పరువూ మర్యాద కోసం డబ్బు ఖర్చు పెట్టి బంధువర్గాన్ని సంతృప్తి పరచడం చూసినప్పుడు ఈ న్యాయము గుర్తుకు రాకమానదు.కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లోనూ,మరికొన్ని తప్పించుకోగలిగినా ఏమోలే మళ్ళీ మళ్ళీ చేస్తామా? ఏమిటి? అనుకుంటూ ఇలా ఖర్చు చేయడాన్నే "దశానామేకాదశ న్యాయము" అంటారు.ఆ తర్వాత జరిగేది ఏమిటో సరదాగా చెప్పి ముగిస్తాను."బొక్క కొరకంగా భోగం – లెక్క చూడంగా దుఃఖం" ఇలాంటివి చాలా మందికి అనుభవమే కదా!"



**-పురిమళ్ల సునంద**
*9441815722*

